- ఆడబిడ్డలకు స్వయం ఉపాధి చూపిస్తున్న 'సెర్ప్'
- కుట్టుశిక్షణతో జీవితాల్లో మార్పు
- జూట్ బ్యాగుల తయారీతో ఉపాధి పొందుతున్న మహిళలు
- ప్లాస్టిక్ రహిత సమాజానికి ఉడతా సాయం




# శిక్షణతో సాధికారత



మహబూబాబాద్, డిసెంబరు 12 (నమస్తే తెలంగాణ) : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) విశేషంగా కృషి చేస్తున్నది. మాస్కులు, యూనిఫాంలు, జూట్ బాగ్యుల తయారీతో ప్రోత్సహిస్తున్నది. ఈ మేరకు ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తూ మహిళా సాధికారతకు తోడ్పాటునందిస్తున్నది.

## ఆదర్శంగా సమాఖ్య సభ్యులు



జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు 2019 నవంబర్‌లో హైదరాబాద్ నుంచి అంబిక అనే శిక్షకురాలు కేసముద్రం వచ్చారు. ఆమె వద్ద మండల కేంద్రంలోని 'సాధికారత మండల సమాఖ్య'కు చెందిన 30 మంది మహిళలు శిక్షణ తీసుకున్నారు. అనంతరం సభ్యులు అప్పటి కలెక్టర్ గౌతమ్‌ను సంప్రదించి మాస్కులు కుట్టే చిన్నపాటి ఆర్డర్‌ను పొందారు. మొదటి, రెండో విడత లాక్‌డౌన్ కలిపి మొత్తం లక్ష వరకు మాస్కులు కుట్టి అందించారు. ఒక్క మాస్కుకు రూ.4 చొప్పున అధికారులు చెల్లించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పని అప్పగించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలనే ఉద్దేశంతో సెర్ప్ అధికారులు కొత్త నినాదంతో ముందుకొచ్చారు. 'ప్లాస్టిక్ నిషేధిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో జ్యూట్ బ్యాగులకు మార్కెట్‌లోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు సమాఖ్య సభ్యులు 'సెర్ప్, సాధికారత మండల సమాఖ్య కేసముద్రం' పేరుతో నమూనా సంచులను మూడు రూపొందించి ప్రాజెక్టు మేనేజర్ నళినికి చూపించారు. వాటిని ఆమె అప్పటి కలెక్టర్‌కు చూపడంతో వాటిని మెచ్చిన ఆయన, ప్రతి మండల సమాఖ్యకు మూడు సంచుల చొప్పున కుట్టి అందించాలని ఆదేశించారు. మండల సమాఖ్యలతో పాటు ప్రతి గ్రామ సమాఖ్యలకు సైతం సంచులను అందించారు. మండల, గ్రామ సమాఖ్యల మహిళలు ఈ సంచులను ఉపయోగిస్తుండడంతో ప్రచారం బాగా జరిగింది. దీంతో వివిధ శుభకార్యాల కోసం పలువురు ప్రత్యేకంగా ఈ సంచులను ఆర్డర్ ఇచ్చి కుట్టిస్తున్నారు.








## ఆకట్టుకుంటున్న బ్యాగులు

మొబైల్ ఫోన్, హ్యాండ్ బ్యాగ్, లంచ్‌బాక్స్ బ్యాగులు, కూరగాయల కోసం, స్టూడెంట్స్ బ్యాగ్స్, స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్ బ్యాగులు, క్లాత్ బ్యాగ్‌లు, ఇలా అన్ని రకాల బ్యాగ్‌లను కుట్టి విక్రయిస్తున్నారు. సైజులు బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. రూ.60 నుంచి రూ.300 వరకు ఒక బ్యాగ్ ధర ఉంటున్నది. కూరగాయల కోసం వినియోగించే సంచులను రూ.25నుంచి రూ.30 చొప్పున అమ్ముతున్నారు.



## శిక్షణతోనే ఉపాధి

గతంలో నేను కుట్టు మిషన్ నడుపుతూ మా కుటుంబానికి చేదోడుగా ఉండేది. 2019లో సెర్ప్ ఆధ్వర్యంలో 30మంది సభ్యులకు సంచుల తయారీపై శిక్షణ ఇప్పించారు. 'ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం' అనే పేరుతో జూట్ బ్యాగులు కుట్టి ఉపాధి పొందుతున్నాం. రోజుకు రూ.500 చొప్పున గిట్టుబాటవుతోంది. నాతో పాటు సరిత, రేష్మా, ప్రమీల భాగస్వాములుగా ఉన్నరు. వచ్చిన ఆదాయాన్ని నలుగురం సమానంగా పంచుకుంటున్నం. ఆర్డర్లు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. అప్పటి అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ తన పెళ్లి కోసం 150 సంచులను ప్రత్యేకంగా కుట్టించుకున్నరు. సామాన్య ప్రజలు మొదలు ఉన్నత స్థాయి అధికారుల దాకా వీటిని చూసి అభినందిస్తున్నరు. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆర్డర్లను ఏపీఎమ్ రాజేర్, డీపీఎం నళిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య మాకే ఇస్తున్నరు. ఈ సంచులు కావాలనుకునేవారు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం(విలేజ్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని మా షాపులో సంప్రదించాలి.

- సాసకాండ్ల రాధిక, సాధికారత మండల సమాఖ్య సభ్యురాలు, కేసముద్రం

## ప్రతిరోజు పర్యవేక్షణలో సర్వే

బడి బయట పిల్లల గుర్తింపు, డ్రాప్‌బాక్స్ పిల్లల ప్రస్తుత స్థితిపై సీఆర్పీలు, ఐఈఆర్పీలు నిర్వహించే సర్వేను ప్రతిరోజు అధికారులు పర్యవేక్షిస్తారు. కాంప్లెక్స్ పరిధిలో జరుగుతున్న సర్వేను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పాఠశాల హెచ్‌ఎం నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. మండలంలో మండల విద్యాశాఖ అధికారి ప్రతీ కాంప్లెక్స్ పరిధిలోని ఒక గ్రామంలో జరిగే సర్వేను పర్యవేక్షించి అప్పటివరకు సేకరించిన సమాచారంపై సమీక్ష నిర్వహించాలి.



బయ్యారం మండలం చింతలతండాలో సర్వే చేస్తున్న సీఆర్పీ కన్నయ్య

## సర్వే షెడ్యూల్ ఇలా

- జనవరి 11 వరకు సీఆర్పీలు, ఐఈఆర్పీలు తమ కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాల్లో బడి బయట పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించాలి.
- రోజువారీగా గుర్తించిన బడి బయట పిల్లలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయాలి.
- జనవరి 11న మండల స్థాయి బడి బయట సర్వే రిపోర్టును జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి.
- జిల్లాస్థాయిలో పరిశీలించిన బడి బయట పిల్లల వివరాలను జనవరి 12న జిల్లా విద్యాశాఖ అధికారి ధ్రువీకరించి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు.



నెల్లికుదురు మండలం వరంబండ తండాలో సర్వే చేస్తున్న సీఆర్పీ కవిత




ఓఎస్సీ సర్వే షురూ

# సాఫీగా సాగేలా..

## ఓఎస్సీ సర్వే ఇలా..

- సీఆర్పీలు, ఐఈఆర్పీలు తమ కంప్లెక్స్ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి బడి బయట పిల్లలను గుర్తించాలి.
- 6 నుంచి 14, 15 నుంచి 19 ఏళ్లలోపు బడిబాట పిల్లలను గుర్తించాలి.
- ఆ పిల్లల విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలల్లో చేర్పించాలి.
- వేరే రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికొచ్చి పని చేసుకుంటున్న వారి పిల్లలు వివరాలు సేకరించాలి.
- డ్రాప్ బాక్స్‌లోని విద్యార్థులు ప్రస్తుతం ఏ పాఠశాలల్లో చదువుతున్నారో సమాచారం సేకరించాలి.
- పక్క రాష్ట్రాల్లో ఉండి ప్రస్తుతం సొంత ప్రదేశాలకు వచ్చిన విద్యార్థులను గుర్తించాలి.




మొగుళ్లపల్లిలో సర్వే చేస్తున్న సీఆర్పీ మధు

## బడీడు పిల్లలను చేర్పించడమే లక్ష్యం

- సీఆర్పీ, ఐఈఆర్పీలతో ఇంటింటా సర్వే
- 6నుంచి 19 ఏళ్లలోపు బడి బయట పిల్లల గుర్తింపు
- ఈ నెల 11నుంచి జనవరి 11వరకు సర్వే
- గుర్తించిన పిల్లల వివరాలు ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్

నెల్లికుదురు/భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 12 : విద్యా హక్కు చట్టం ప్రకారం 6-14 సంవత్సరాలు కలిగిన బడీడు పిల్లలందరు పాఠశాలల్లో నమోదై ఉండాలి. డ్రాపౌట్స్ సంఖ్యను తగ్గించి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచే లక్ష్యంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి బయట పిల్లల సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నది. సీఆర్పీలు, ఐఈఆర్పీలు తమ కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి బడి బయట పిల్లలను గుర్తించి వారి వివరాలను నిర్ణీత ఫార్మాట్‌లో పూరిస్తున్నారు. బడీడు పిల్లలు పాఠశాలల్లో నమోదై లేకుంటే ప్రధానోపాధ్యాయుల సమక్షంలో తక్షణమే పాఠశాలల్లో నమోదు చేయించనున్నారు. ఈ సర్వే ఈ నెల 11న మొదలుకాగా జనవరి 11వరకు కొనసాగనున్నది. రోజువారీ సర్వేలో గుర్తించిన బడి బయట విద్యార్థులను రోజువారీగా ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు జిల్లా వ్యాప్తంగా 2022-23 విద్యా సంవత్సరంలోని బడిబయట పిల్లలు ప్రస్తుతం ఏ పాఠశాలలో నమోదు ఉన్నారు?, డ్రాప్‌బాక్స్‌లోని పిల్లలు ఏ పాఠశాలలో చదువుతున్నారు.? తదితర వివరాలను సర్వేలో గుర్తిస్తారు.

## విధిగా సర్వే చేయాలి..



6-14, 15-19 ఏళ్లలోపు పిల్లలందరు తప్పకుండా పాఠశాల, కళాశాలల్లో నమోదై ఉండాలి. సీఆర్పీలు, ఐఈఆర్పీలు విధిగా ఇంటింటా సర్వే చేయాలి. సర్వే వివరాలను విద్యాశాఖ నిర్దేశించిన ఫార్మాట్‌లో సమగ్రంగా పొందుపర్చాలి. ఐఈఆర్పీలు మండల వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల వివరాలను సేకరించాలి. బడి బయట పిల్లలను గుర్తించి తక్షణమే సంబంధిత గ్రామ పాఠశాల హెచ్‌ఎంతో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి. బడీడు పిల్లలెవ్వరు కూడా పాఠశాలలో నమోదై లేకుండా ఉండొద్దు. జనవరి 11కల్లా సర్వే పూర్తికావాలి. రోజువారీ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి.

- రామారావు, డీఈవో, మహబూబాబాద్

## పకడ్బందీగా నిర్వహిస్తాం..



అందరికీ విద్య అందించాలన్నదే సర్వే లక్ష్యం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా సర్వే నిర్వహిస్తాం. సీఆర్పీలు క్షేత్రస్థాయిలో వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారు. బడీడు పిల్లల వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తాం. జిల్లాలో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. సర్వేలో గుర్తించిన పిల్లలు తిరిగి చదువుకునేలా చర్యలు తీసుకుంటాం.

- కే.లక్ష్మణ్. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, జయశంకర్ భూపాలపల్లి



మాదన్నపేట గ్రామ శివారులో హార్వెస్టర్‌తో వరి కోతలు

# వరి కోత యంత్రాలకు యమగిరాకీ

- హార్వెస్టర్ల వినియోగంపైనే రైతుల ఆసక్తి
- తక్కువ వ్యయం, త్వరగా పంట ఉత్పత్తులు చేతికి..

నర్సంపేట రూరల్, డిసెంబర్ 12 : వ్యవసాయరంగంలో ప్రతీ సంవత్సరం నూతన మార్పులు వస్తున్నాయి. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఒకేసారి వరి సాగు కోతకు రావడంతో కోత యంత్రాలకు గిరాకీ పెరిగింది. కూలీలకు బదులు యంత్రాలతో గంటల వ్యవధిలోనే పంట ఉత్పత్తులు చేతికి అందివస్తుండడంతో రైతులు ఈ యంత్రాల వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ సంవత్సరం కొంత ఆలస్యమైనప్పటికీ సమృద్ధిగా వర్షాలు కురవడంతో బావులు, చెరువులు, కుంటల కింద ఒకేసారి రైతాంగం వరి సాగుకు చేశారు. దాదాపు వరి ఒకేసారి కోతకు రావడంతో యంత్రాలకు భలే గిరాకీ వచ్చింది. రాష్ట్రం నుంచి గాక ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి వరికోత యంత్రాలు భారీగా తరలివచ్చాయి. అన్ని గ్రామాల్లో హార్వెస్టర్ యజమానులు యంత్రాలను ఇప్పటికే దింపారు. ఎకరం వరి కోసేందుకు హార్వెస్టర్ యజమానులు రూ.2వేల నుంచి రూ.2200 తీసుకుంటున్నారు. చైన్ మిషన్‌కు మాత్రం రూ.3200ల నుంచి రూ.3600 వరకు చార్జి చేస్తున్నారు. ఒక ఎకరం వరిని వరికోత యంత్రాలు రెండు గంటల్లోపు కోస్తున్నాయి. వరి కోత యంత్రాల విధానమే బాగుందని పలువురు రైతులు అంటున్నారు. కూలీల సహాయంతో కోతకోసి, కుప్ప పెట్టి, కుప్ప నూర్పిడి చేసే సరికి సుమారు ఎకరానికి రూ.8వేల నుంచి 9వేల వరకు ఖర్చు వస్తుందంటున్నారు. యంత్రాల సహాయంతో కోస్తే వరిగడ్డి అక్కెరకు రాకుండా పోతుంది. గడ్డి అవసరమున్న రైతులు తప్ప మిగతా వారంతా వరి కోతయంత్రాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాలను గమనించిన హార్వెస్టర్ యజమానులు గ్రామానికి ఒకటి రెండు చొప్పున యంత్రాలను తీసుకువచ్చి సొమ్ముచేసుకుంటున్నారు.



# సిరుల బంతి



- అధిక లాభాలు తెచ్చిపెడుతున్న పూల సాగు
- తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు సాధిస్తున్న చక్రధర్

ఎల్కతుర్తి, డిసెంబర్ 12 : ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు గతానికి భిన్నంగా బంతి, గులాబీ పూల సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. వాతావరణ పరిస్థితులు, గిరాకీని బట్టి పండుగ సీజన్లలో ఎక్కువ బంతిని రైతులు సాగుచేస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని వల్భాపూర్, జీల్గుల గ్రామాల్లో కొందరు బంతి పూలను సాగు చేస్తూ అధిక లాభాలను గడిస్తున్నారు. హుజూరాబాద్‌కు చెందిన చక్రధర్ జీల్గుల గ్రామంలో తనకున్న ఎకరం 30గుంటల భూమిలో బంతి, గులాబీ తోటలు సాగు చేస్తున్నాడు. ఒక్కో మొక్కకు రూ.38 వెచ్చించి దాదాపు 2700 మొక్కలు నాటాడు. ఇందుకోసం రూ.3లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం గులాబీ పంట ఏపు పెరిగింది. మిగతా భూమిలో బంతి సాగుచేస్తున్నాడు. బంతి సాగుకు రూ.లక్షా 50వేల వరకు పెట్టుబడి పెట్టాడు. పండుగ సీజన్లలో బంతి పూలను వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. హోల్‌సేల్‌గా కిలోకు రూ.50 చొప్పున పూలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఐదు నెలల కాలంలో బంతి పూలపై లక్షన్నర వరకు లాభం వచ్చినట్లు రైతు చక్రధర్ చెప్పాడు.



చక్రధర్ సాగుచేస్తున్న బంతి పూల తోట



## తోట వద్దకే వచ్చి కొంటున్నరు..

వరి, పత్తి, మిరప తదితర పంటల సాగుకు పెట్టుబడి ఖర్చు ఎక్కువ అవుతోంది. లాభాలు కూడా తక్కువ ఉంటున్నాయి. అందుకే బంతి, గులాబీ తోటల సాగు చేస్తున్నా. గులాబీ తోటపై పెట్టుబడి బాగా పెట్టాను. ఇప్పుడిప్పుడే పూలు పూస్తున్నాయి. బంతి పూలు మాత్రం దసరా, దీపావళి, సంక్రాంతి పండగలకు బాగానే అమ్ముడుపోయాయి. ఇప్పటివరకైతే బంతి పూలతో ఆమ్దానీ బాగానే ఉంది. వ్యాపారులు తోట వద్దకే వచ్చి హోల్‌సేల్‌గా కిలోకు రూ.50 చొప్పున క్వింటాళ్ల లెక్కన తీసుకెళ్తున్నారు. బంతిపూల సాగు ఇతర పంటల కంటే బాగుంది.

- చక్రధర్, రైతు, హుజూరాబాద్



